

టన్ను చీనీ రూ.20 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు ఐదు టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.13
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.7°/14.2°
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. గాలివేగం స్వల్పంగా పెరిగింది. గంటకు 6 నుంచి 10 కి.మీ. వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పుట్టపర్తిలో శిశుగృహ ఏర్పాటుకు చర్యలు



భవనం రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రం పుట్టపర్తిలో వీలైనంత త్వరగా శిశు గృహను ఏర్పాటు చేయనున్నట్లు బాలల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మేడా రామలక్ష్మి తెలిపారు. పుట్టపర్తిలో శిశుగృహ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం ఆమె పట్టణంలో పర్యటించారు. శిశు గృహకు ఏర్పాటుకు పలు గృహాలను పరిశీలించారు. ఎనుములపల్లిలోని భవనం అన్ని విధాలా అనుకూలంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో నిరాదరణకు గురైన పిల్లలు, అనాథలను చేరదీసి శిశు గృహాలో ఉంచి సంరక్షించడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పుతామన్నారు. పసిప్రాయంలోనే వీధిన పడిన బాలలను సంరక్షించడమే లక్ష్యంగా శిశు గృహ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఫరూక్ బాషా, డీసీపీఓ మహేష్, పీఓలు మురళి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల నిర్వహణపై నేడు సమీక్ష

పుట్టపర్తి: పదో తరగతి పరీక్షల నిర్వహణపై గురువారం మధ్యాహ్నం 2 గంటలకు బుక్కపట్నం 'డైట్' కళాశాలలో సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉన్నత, ఆదర్శ, ఎయిడెడ్ పాఠశాలలు, కేజీబీవీల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులంతా తప్పనిసరిగా సమీక్షకు హాజరు కావాలన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా నిలుస్తూ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లను గురువారం సన్మానిస్తున్నట్లు గ్రామ/వార్డు సచివాలయ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, ఎంపీ, ప్రజాప్రతినిధులు, అధికారులు తరలిరావాలని కోరారు.

సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకం



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులతో కలిసి సంజీవయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... కర్నూలు జిల్లా పెదపాడు గ్రామంలో సాధారణ దళిత కుటుంబంలో జన్మించిన దామోదరం సంజీవయ్య చిన్నప్పటి నుంచి ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. 38 ఏళ్ల పిన్నవయసులో ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి సేవలందించారన్నారు. సమాజ హితమే లక్ష్యంగా సేవలందించిన సంజీవయ్య బాటలో అందరూ నడవాలన్నారు. డీఆర్‌ఓ కొండయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు శివరంగప్రసాద్, మోహన్‌రాం, నిర్మలాజ్యోతి పాల్గొన్నారు.

గంధం చెక్కలు స్వాధీనం

కదిరి టౌన్: అక్రమంగా నిల్వ చేసిన గంధం చెక్కలను పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వివరాలను ఎస్‌ఐ బాబ్జాన్ వెల్లడించారు. బెంగళూరుకు చెందిన అల్తాఫ్ 22.5 కిలోల గంధపు చెక్కలను విక్రయించాలంటూ కదిరి మున్సిపల్ పరిధిలోని బోయరామన్నగారిపల్లికి చెందిన మల్లీశ్వరికి ఇచ్చాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బుధవారం మల్లీశ్వరి ఇంట్లో తనిఖీలు చేసి గంధపు చెక్కలు స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం మల్లీశ్వరితో పాటు అల్తాఫ్‌పై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న అల్తాఫ్ కోసం ముమ్మర గాలింపు చేపట్టారు.

ముంపు గ్రామం..అభివృద్ధి పథం

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) ముంపునకు గురైన మర్రిమాకులపల్లిని ప్రభుత్వం మరోచోటకు మార్చింది. నాలుగేళ్లలో నిధులు వరద పారించడంతో అభివృద్ధి కొంత పుంతలు తొక్కుతోంది. సకల సౌకర్యాలతో గ్రామంలో నూతన శోభ సంతరించుకుంది. నాలుగు దశాబ్దాల ఎదురుచూపులకు ఫలితం దక్కగా.. 408 మందికి పరిహారం మంజూరైంది.

నాలుగు దశాబ్దాల కల సాకారం
- సీబీఆర్ ముంపు గ్రామం మర్రిమాకులపల్లికి నూతన శోభ
- 408 మందికి రూ.40.80 కోట్ల పరిహారం
- రూ. కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



మర్రిమాకులపల్లి గ్రామం ఏరియల్ వ్యూ

ఊరు మారింది

తాడిమర్రి: మండల సరిహద్దులో వైఎస్సార్ జిల్లా, లింగాల మండలం, పార్నపల్లి గ్రామం వద్ద 1990లో చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మండలంలోని పెద్దకోట్ల, గుడ్డంపల్లి, మోదుగులకుంట, మర్రిమాకులపల్లి, చిన్నచిగుళ్లరేవు గ్రామాలతో పాటు ఆయా గ్రామాల రైతుల వ్యవసాయ భూములు కూడా సీబీఆర్ ముంపునకు గురయ్యాయి. దీంతో రిజర్వాయర్ నిర్మాణ సమయంలో ఆయా గ్రామాల వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎప్పుడు నీరు గ్రామాన్ని ముంచెత్తుతుందో తెలియక భయం గుప్పిట్లో బతికారు. వందల సార్లు అప్పటి ప్రభుత్వానికి విన్నవించుకున్నా ముంపు గ్రామాల గోడు ఎవరూ పట్టించుకోలేదు.

వైఎస్సార్ హయాంలో అడుగులు..
2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే సీబీఆర్ నిర్మాణం ఊపందుకుంది. అలాగే ముంపునకు గురవుతున్న గ్రామాలకు పరిహారం మంజూరుకూ చర్యలు చేపట్టారు. అయితే సాంకేతిక కారణాలతో చిన్నచిగుళ్లరేవు, మర్రిమాకులపల్లి గ్రామాలకు పరిహారం అందలేదు. వాటిని సరిచేస్తున్న క్రమంలోనే వైఎస్సార్ అకాల మరణం చెందారు. తదనంతరం ఎందరు ముఖ్యమంత్రులు మారినా చిన్నచిగుళ్లరేవు, మర్రిమాకులపల్లి గ్రామస్తుల బాధలు పట్టించుకోలేదు.

కల సాకారం చేసిన జగన్ సర్కార్..
సీబీఆర్ ముంపు పరిహారం కలగా మారగా, నాలుగు దశాబ్దాలుగా చిన్నచిగుళ్లరేవు, మర్రిమాకులపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈక్రమంలో 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఈ రెండు గ్రామాల పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. దీంతో ఆయన రెండు గ్రామాలకూ పరిహారం అందించారు. ఈ క్రమంలో మర్రిమాకులపల్లిలోని 408 మందికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల ప్రకారం రూ.40.80 కోట్లు అందాయి. మరో 119 మందికి రూ.11.90 కోట్లు మంజూరయ్యాయి.

మర్రిమాకులపల్లికి చేకూరిన లబ్ధి ఇలా..

ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ వ్యయం	రూ.50 లక్షలు
తాగునీటి బోర్లు, పైపులైన్ల ఖర్చు	రూ.5 లక్షలు
రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి	రూ.21.80 లక్షలు
వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి	రూ.20.80 లక్షలు
సీసీ రోడ్ల నిర్మాణ వ్యయం	రూ.14 లక్షలు
పాఠశాలలో అభివృద్ధి పనులకు	రూ.20 లక్షలు

రూ.కోట్లతో అభివృద్ధి పనులు..
ముంపునకు గురైన మర్రిమాకులపల్లి గ్రామాన్ని వైఎస్ జగన్ సర్కార్ అక్కడి నుంచి ఎం.అగ్రహారం సమీపంలోకి మార్చింది. గ్రామంలో 357 కుటుంబాలు, 1,025 మంది జనాభా ఉండగా, ప్రభుత్వం గ్రామం నిర్మాణానికి భూమిని కేటాయించి, గ్రామస్తులందరికీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. 2021 నాటికి గ్రామం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోగా, ప్రభుత్వం కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. రోడ్లు, మురుగు కాల్వలు, తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామస్తులకు వివిధ పథకాలు అందజేసింది. అలాగే రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మించి సేవలను ముంగిళ్లలోకే తీసుకువచ్చింది. ఇక 'నాడు–నేడు'పథకం ద్వారా గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మౌలిక వసతులన్నీ కల్పించింది. ఎస్సీ కాలనీలో రూ.లక్షలు వెచ్చించి మురుగునీటి కాల్వల నిర్మాణం చేపట్టింది. ఇలా మర్రిమాకులపల్లి గ్రామాన్ని జగన్ సర్కార్ అభివృద్ధికి చిరునామాగా మార్చింది.



తాగునీటి కోసం గ్రామంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్

ఎమ్మెల్యే చొరవతో పరిహారం



గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పరిహారం అందక ఇబ్బందులు పడ్డాం. మా కష్టాలు చూసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపి పరిహారం మంజూరు చేయించారు. కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున అందించి మాకెంతో మేలు చేశారు. మా కష్టాలు తీర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.
–మేదిరెడ్డి శంకర్‌రెడ్డి, మర్రిమాకులపల్లి, తాడిమర్రి.

సౌకర్యాలు కల్పించారు



సీబీఆర్ ముంపు పునరావాసం కింద ప్రభుత్వం మర్రిమాకులపల్లిలో సకల సౌకర్యాలు కల్పించింది. ఓవర్ హెడ్ ట్యాంక్‌తో తాగునీటి సౌకర్యంతో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్, 'నాడు–నేడు'నిధులతో పాఠశాలలో విద్యార్థులకు పలు సౌకర్యాలు, సదుపాయాలు కల్పించారు.
–ఎం.నాగభూషణం, మర్రిమాకులపల్లి, తాడిమర్రి.

నాటి కష్టాలన్నీ తీరాయి



సీబీఆర్‌లోకి నీరు చేరుతోందంటే మా ప్రాణాలుపైనే పోయేవి. ఎప్పుడు గ్రామాన్ని నీరు చుట్టుముడుతుందో, ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతికేవాళ్లం. దీన్ని గుర్తించి ప్రభుత్వం మా గ్రామాన్ని సీబీఆర్ పరివాహకానికి దూరంగా మరోచోట నిర్మించింది. మౌలిక వసతులు కల్పించడంతో పాటు అందరికీ పరిహారం ఇవ్వడంతో నాటి కష్టాలన్నీ తీరాయి.
–యూ.రమణారెడ్డి, మర్రిమాకులపల్లి, తాడిమర్రి

టికెట్లు..'పరిటాల' పాట్లు

- రాజకీయాలను శాసించిన కుటుంబానికి ఇప్పుడు కష్టాలు
- రెండు సీట్ల నుంచి ఒక సీటుకు.. అదీ ఎక్కడో తేల్చుకోలేని దైన్యం
- 2019లో రాప్తాడు నుంచి పోటీచేసి ఓడిపోయిన పరిటాల శ్రీరామ్
- పోటీలో ఎవరు ఉండాలో తేల్చుకోలేకపోతున్న తల్లీతనయులు
- సొంత పార్టీలోనే సునీతకు పెరిగిన రాజకీయ ప్రత్యర్థులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిటాల కుటుంబం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటోంది. ఫ్యాక్షనిస్టుగా, మాజీ నక్సలైటుగా జిల్లాలో దశాబ్దకాలం పాటు పరిటాల రవి రాజకీయాలను శాసించారు . ఆయన మరణానంతరం టీడీపీ గడ్డు కాలం ఎదుర్కొంటోంది. సొంత పార్టీలోనే గ్రూపులు, అధిష్టానం ఆడుతున్న డ్రామాలు వెరసి పరిటాల సునీత, తనయుడు పరిటాల శ్రీరామ్ రాజకీయ భవిష్యత్‌కు ప్రతిబంధకాలయ్యాయి. మరోవైపు తల్లీ కొడుకుల మధ్యే ఎన్నికల్లో పోటీ ఎవరు చేయాలనే మీమాంస వీరిని ఇరకాటంలో పెడుతోంది.



పరిటాల కుటుంబం ప్రభ తగ్గింది

పరిటాల రవి మరణానంతరం ఆయన భార్య పరిటాల సునీత ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 2014 ఎన్నికల్లో గెలిచి మంత్రి అయ్యారు. మంత్రిగా ఉండి కూడా ఆమె ఎలాంటి అభివృద్ధీ చేయకపోవడంతో జిల్లాలో క్రమంగా పరిటాల కుటుంబ పరపతి తగ్గింది. పరిటాల శ్రీరామ్ వ్యవహారశైలి కూడా జనానికి ఆ కుటుంబాన్ని దూరం చేసింది. 2019లో సునీత పోటీ చేయకుండా పరిటాల శ్రీరామ్ రాప్తాడు నియోజకవర్గం నుంచి పోటీ చేసి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతిలో ఓటమి చవిచూశారు. దీంతో జిల్లాలో పరిటాల ప్రభ పూర్తిగా మసకబారింది.

ప్రభావం లేదని గుర్తించిన అధిష్టానం
ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిటాల కుటుంబ ప్రభావం ఏమాత్రమూ లేదనడానికి తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తున్న తీరే కారణం. 'మీ కుటుంబానికి ఒక్కటే సీటు.. ఇష్టమైతే రండి లేదంటే పోండి' అన్నట్టు చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. దీంతో రాప్తాడు, ధర్మవరం రెండు నియోజకవర్గాల్లోనూ పోటీ చేయాలని భావించిన సునీత, శ్రీరామ్‌ల ఆశలు అడియాసలయ్యాయి. మరోవైపు సునీత ఆర్థిక పరిస్థితి బాగోలేదని, ఒక్క టికెట్ అయితే సరిపోతుందని చంద్రబాబు తన అనుకూల మీడియాలో లీకులు ఇప్పించారు. అధిష్టానం దెబ్బతో తల్లీ తనయులు కుదేలయ్యారు.

పోటీలో తల్లా.. కొడుకా?
రానున్న ఎన్నికల్లో ఎవరు పోటీయాలనే దానిపై తల్లీకొడుకు తేల్చుకోలేక పోతున్నారు. 2019లో పోటీచేసి ఓడిపోయిన శ్రీరామ్.. మళ్లీ తనకే టికెట్ కావాలని తల్లిమీద ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది. కొడుకైతే ఓడిపోతాడని, తానే పోటీ చేస్తానని సునీత భావిస్తున్నట్టు తెలుస్తోంది. శ్రీరామ్‌కు టికెట్ ఇవ్వకపోతే ఒప్పుకోడు.. ఇస్తే ఓడిపోయే పరిస్థితులున్నాయి. దీంతో సునీత తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, పైగా రాప్తాడులో గతంలోలాగా కేడర్ సహకరించే పరిస్థితి లేదని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

గ్రూపులు వెంటాడుతున్నాయి
పరిటాల కుటుంబానికి రాజకీయ ప్రత్యర్థులు ఎక్కువయ్యారు. వరదాపురం సూరికి, పరిటాల కుటుంబానికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. పయ్యావుల కేశవ్‌కు పరిటాల కుటుంబంతో పొసగదు. ప్రభాకర్ చౌదరికి అస్సలే పడదు. ఇలా ఉమ్మడి అనంతపురం జిల్లాలో చెప్పుకుంటూ వెళితే ఏ ఒక్క నాయకుడూ పరిటాల కుటుంబంతో అనుకూలంగా లేకపోవడం కూడా వీరికి మైనస్‌గా మారింది. పరిటాల పతనమే తమ లక్ష్యమంటూ ప్రత్యర్థులు పావులు కదుపుతున్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి





వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట దంపతులకు హారతి ఇస్తున్న మహిళ

- వైఎస్సార్ సీపీ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం
- ఐదేళ్లలోనే హామీలన్నీ నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంతం
- అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ విజయ సోపానాలు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: జనరంజక పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేసిన జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని చారుపల్లిలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆయన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి, కుటుంబీకులతో కలిసి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శంఖం పూరించి ఇంటింటా ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సీఎం జగనన్న నాయకత్వంలో అమలు చేసిన నవరత్న పథకాలతో ముద్రించిన కరపత్రాలను ఓటర్లకు అందించారు.

వంద శాతం హామీలు నెరవేర్చాం
2019 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వందశాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల ఉత్తమ భవిష్యత్ కోసం 'నాడు–నేడు' కింద రూ.67 వేల కోట్లు ఖర్చుచేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది పేద పిల్లలు సైతం ఇంగ్లిష్ విద్యను అభ్యసించేలా చర్యలు చేపట్టారన్నారు.

జగన్ వెంటే జనం
రైతులు, కార్మికులు, వృద్ధులు, అక్కచెల్లెమ్మలు, ఇలా అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే అన్నారు. అందువల్లే అన్ని వర్గాల ప్రజలు మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ విజయ సోపానాలని, త్వరలో జరిగే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అఖండ మెజార్టీ సాధించి వైఎస్ జగన్ రెండోసారి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జగనన్న సహకారంతో పుట్టపర్తి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంతగా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం కొనసాగుతుందన్నారు. గ్రామంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి ముందుండి ప్రచారాన్ని కొనసాగించారు. గడప గడపలోనూ ఆమెకు మహిళలు హారతులు పట్టి, తిలకం దిద్ది మద్దతు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీలమ్మ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ తిప్పమాంబ, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె. సూర్యనారాయణ, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ ఎంసీ బయపరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అశ్వర్థనారాయణ, సాతర్ల రామచంద్ర, డీలర్లు మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామలింగారెడ్డి, శ్రావణ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పాస్టర్ల సదస్సు

అనంతపురం కల్చరల్: ఉమ్మడి జిల్లా పాస్టర్ల సదస్సు గురువారం అనంతపురంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి, అంతర్జాతీయ సువార్త ప్రసంగీకురాలు వైఎస్ విమలారెడ్డి, ప్రభుత్వ క్రిస్టియన్ గౌరవ సలహాదారుడు రెవరెండ్ పాస్టర్ బాలాస్వామి, క్రిస్టియన్ మైనార్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా సదస్సు జరిగే ఫంక్షన్ హాల్‌ను నిర్వాహకులు సీఎస్ఐ సంఘ కాపరి రెవరెండ్ బెన్హర్‌బాబు, పాస్టర్ల వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు నెహెమ్యా నాగరాజు, పాస్టర్ మనుష్యే తదితరులు బుధవారం పరిశీలించారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

కుందుర్పి: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో విశేష హోమాలు, పూజలు జరిగాయి. మధ్యాహ్నం రథంపై ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి గోవింద నామస్మరణతో భక్తులు లాగారు. రాత్రి 9గంటలకు ధూళోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. గురువారం రాతిదూలం లాగుడు పోటీలు, పానకం బండ్ల ఊరేగింపు, శుక్రవారం ఉట్లమాను జాతర ఉంటాయి. ఉత్సవాలను ఆలయ ధర్మకర్త సత్యనారాయణ శాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి తదితరులు పర్యవేక్షించారు.

సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు పిలుపు
- ఘనంగా సేవాలాల్ 285 జయంత్యుత్సవాలు
- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన బంజారాలు
- సేవాగఢ్‌ను విద్యా హబ్‌గా మారుస్తామన్న వక్తలు


మాట్లాడుతున్న సేవాలాల్ ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు


హాజరైన బంజారాలు

గుత్తి రూరల్: బంజారాల హక్కులతో పాటు ధర్మం, గో సంరక్షణ, సమాజాభివృద్ధికి పాటుపడిన సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని, ఆయన బాటలో పయనించాలని సేవాలాల్ ట్రస్టు అధ్యక్షుడు కొర్రా జగన్నాథరావు పిలుపునిచ్చారు. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ 285వ జయంత్యుత్సవాలు బుధవారం రాత్రి సేవాగఢ్‌లో ఘనంగా నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు జ్యోతి ప్రజ్వలన చేసి, టెంకాయ కొట్టి ప్రారంభించారు. బంజారాలు ముందుగా సేవాలాల్ ఉత్సవ విగ్రహంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం విగ్రహాన్ని ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి రావడంతో సేవాగఢ్ కిక్కిరిసిపోయింది. ఉత్సవాలనుద్దేశించి సేవాలాల్ ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు మాట్లాడుతూ బంజారాల హక్కుల కోసం జల్ (నీరు), జమీన్ (భూమి), జంగల్(అడవి) అనే నినాదంతో సేవాలాల్ పోరాడారన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్, బంజారా సంఘం నాయకులు కేశవ నాయక్, శంకర్ పవార్ మాట్లాడుతూ దేశంలో అతి పెద్ద జాతి బంజారాలదే అని, బంజారాల తెగ అన్ని రాష్ట్రాల్లో వ్యాపించిందని అన్నారు. సేవాలాల్ మహరాజ్ సేవాగఢ్‌లో పుట్టినట్లు చరిత్ర ఆధారాలను బట్టి రంజిత్‌సింగ్ నాయక్ కనుగొన్నారని అన్నారు. సేవాగఢ్ ఆలయ అభివృద్ధిని తాము ముందుండి నడిపిస్తామని చెప్పారు. సేవాగఢ్‌ని విద్యా హబ్‌గా తయారు చేస్తామన్నారు. సేవాగఢ్‌లో ఇప్పటికే గిరిజన సంక్షేమ గురుకులం, జూనియర్ కళాశాల ఏర్పాటయ్యాయన్నారు. భవిష్యత్తులో డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీఏ, వైద్య కళాశాలతో పాటుగా బంజారా యూనివర్సిటీ ఏర్పాటు విషయమై ప్రభుత్వంతో సంప్రదిస్తామన్నారు. ఆలయ ఆవరణలో టీటీడీ కల్యాణ మండపం అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఉత్సవాలకు వచ్చిన అతిథులను బంజారాల సంప్రదాయ తలపాగా (పగిడి)లతో ప్రత్యేకంగా సన్మానించారు.

బంజారాలు సన్మార్గంలో పయనించండి

బంజారాలు చెడు వ్యసనాలు వీడి దైవారాధన, సేవా కార్యక్రమాలతో సన్మార్గం వైపు పయనించి మానవ జన్మ సార్థకం చేసుకోవాలని రమేష్ గురూజీ మహరాజ్ సూచించారు. బంజారాలు విద్యావంతులై ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. ఉత్సవాలలో వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థనాయక్, సభ్యులు శేఖర్‌నాయక్, హరిలాల్ నాయక్, ఠాగూర్ నాయక్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి వైఖోమ్, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, సినీ గాయకుడు గజల్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ భారతి హాజరయ్యారు. డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, గుత్తి సీఐలు వెంకటరామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ నబిరసూల్ ఆధ్వర్యంలో 250 మంది పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.

పుణ్యక్షేత్రంగా సేవాగఢ్

భారతదేశంలోనే బంజారాలకు ఏకైక ఆలయం అనంతపురం జిల్లా సేవాగఢ్‌లో ఉండటం సంతోషంగా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఈ ఆలయం పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లాలని ఆకాంక్షించారు. సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రతి ఏటా ఫిబ్రవరి 15న అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం గర్వంగా ఉందన్నారు. సేవాలాల్ జయంతిని అనంతపురం జిల్లా పండుగగా గుర్తించడం శుభ పరిణామమన్నారు. అందుకు గిరిజనుల తరఫున సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనులు కూడా ముఖ్యమంత్రికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సేవాగఢ్ దర్శనం.. పూర్వజన్మ సుకృతం


సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

గుత్తి రూరల్: సేవాగఢ్‌లోని బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలకు హాజరైన మంత్రికి టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్, సేవాలాల్ ట్రస్టు సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాతా జగదాంబ, సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. బంజారాలు అన్ని రంగాల్లోనూ విశేషంగా రాణిస్తున్నారన్నారు. సేవాలాల్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నిత్యాన్నదానానికి తన వంతుగా రూ.లక్ష విరాళాన్ని మంత్రి ప్రకటించారు. మంత్రికి ట్రస్టు సభ్యులు శాలువాతో సత్కరించి, సేవాలాల్ చిత్రపటాన్ని అందజేశారు.

జనవాక్కు

ఇల్లు మంజూరైంది



పాతికేళ్లుగా అద్దె ఇంట్లోనే జీవనం సాగిస్తున్న మేము టీడీపీ హయాంలో మూడు పర్యాయాలు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. జన్మభూమి కమిటీ సభ్యుల సిఫారసు లేకపోవడంతో సొంతిల్లు దక్కలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మేము అడగకపోయినా ఇంటి స్థలం మంజూరు చేశారు. గృహ నిర్మాణం పూర్తి కావస్తోంది. మరి కొన్ని రోజుల్లో సొంతింట్లోకి చేరుకుంటున్నాం. నాకు ముగ్గురు సంతానం కాగా, పెద్దబ్బాయి ఐటీఐ చదువుతుండడంతో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు వర్తించాయి. అలాగే రెండో అబ్బాయికి నాణ్యమైన చదువులు చేరువయ్యేలా ట్యాబ్ అందజేశారు. చిన్న పాపకు అమ్మ ఒడి పథకం వర్తించింది. కేవలం చిన్న పాటి అంగడి పెట్టుకుని వచ్చే అరకొర వ్యాపారంతో జీవనం సాగిస్తున్న మాకు సొంతిల్లు మంజూరు చేసి లక్షాధికారిని చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వివిధ పథకాలతో రూ.4.50 లక్షల లబ్ధి పొందాను. ఇంత గొప్ప ప్రభుత్వం పది కాలాల పాటు కొనసాగితే ఎందరో పేదల జీవితాలు బాగుపడుతాయి. అందుకే మా మద్దతు వైఎస్ జగనన్నకే.

– ఎస్‌జే షబానా, గాండ్లపెంట

పిల్లలు ఇంగ్లిష్ నేర్చుకున్నారు



మాకున్న ఇద్దరు పిల్లలకు బాగా చదివించాలనుకున్నాం. అయితే ఇంగ్లిష్ మీడియంలో చదివించాలంటే ప్రైవేట్ పాఠశాలకు పంపే ఆర్థిక స్తోమత లేదు. దీంతో ప్రభుత్వ బడిలోనే చేర్పించాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ బడుల్లోనే ఇంగ్లిష్ మీడియం చదువులు చెబుతుండడంతో మాకెంతో సంతోషం కలిగించింది. దీనికి తోడు ఇద్దరిలో ఒకరికి అమ్మ ఒడి పథకం వర్తించింది. గతంలో ఎన్నడూ చూడనంత నాణ్యమైన యూనిఫాం, పుస్తకాలను బడి ప్రారంభానికి ముందే ఇస్తున్నారు. ఇప్పుడు మా పిల్లలు ఇంగ్లిష్ బాగా చదవగలుగుతున్నారు. మాలాంటి పేదల పిల్లలకు నాణ్యమైన చదువులు చేరువ చేసిన సీఎం వైఎస్ జగనన్నకు మేమెంతో రుణపడ్డాం.

– శాంతమ్మ, కుర్లపల్లి, లేపాక్షి మండలం

ఔట్ సోర్సింగ్ నియామకాల్లేవు

- ఖాద్రీ ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని కల్యాణకట్టలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఎలాంటి నియామకాలు చేపట్టలేదని ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ అంశంపై సామాజిక మాధ్యమాల్లో నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ఆలయ ప్రతిష్టను దిగజార్చరాదని పట్టణ క్షురకుల సంఘం సభ్యులకు విజ్ఞప్తి చేశారు. కొన్నేళ్లుగా ఆలయంలో వంశపార్యంపరంగా భజంత్రీలు, క్షురకులు కొనసాగుతూ వస్తున్నారన్నారు. ఈ క్రమంలో కల్యాణకట్టలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఆరుగురిని నియామకానికి సంబంధించి దేవదాయదాఖ కమిషనర్ నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు భవిష్యత్తులో పూర్తిగా పారదర్శకంగా పండుగలు, పర్వదినాలు, వారం చివరి రోజుల్లో క్షురకుల సేవలను అవసరం మేరకు ఉపయోగించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ అంశంలో స్థానిక నిరుద్యోగ యువకులకు ప్రాధాన్యతనిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ధర్మవరంలో ఎంవీఐ కార్యాలయం

- ప్రారంభించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి


ఎంవీఐ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

ధర్మవరం: స్థానిక మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ఎంవీఐ కార్యాలయాన్ని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి బుధవారం ప్రారంభించారు. జిల్లా రవాణాశాఖాధికారి కరుణసాగర్‌రెడ్డి, ఎంవీఐ డీఎస్ఎం వరప్రసాద్, శివప్రసాద్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ... ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ, రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని సీకేపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లో 69,419 వాహనాలు ఉన్నాయని, వీరంతా డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్, ఎఫ్‌సీ తదితర వాటికి వెళ్లాలంటే కదిరిలోని ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకురావడంతో సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించినట్లు గుర్తు చేశారు. సానుకూలంగా స్పందించిన సీఎం... ఈ ఏడాది జనవరి 12న ధర్మవరంలో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటుకు జీఓ జారీ చేశారన్నారు. దీంతో తాత్కాలిక కార్యాలయాన్ని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసి, సరిపడ సిబ్బందిని నియమించినట్లు వివరించారు. బుధ, శుక్రవారాల్లో వాహనదారులు ఎంవీఐ కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్, రెన్యూవల్స్, వాహనాల రిజిస్ట్రేషన్స్, వాహనాల ఎఫ్‌సీతో పాటు పలు సేవలు ధర్మవరంలోనే పొందవచ్చునన్నారు. ధర్మవరం పట్టణంలో అభివృద్ధి అంటే కేతిరెడ్డి అనేలా శాశ్వత ఖ్యాతి దక్కించుకోవడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్‌చైర్మన్ వేముల జయరామిరెడ్డి, 40 వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

అట్టహాసంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన


పూజల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, తదితరులు

హిందూపురం: స్థానిక దండురోడ్డు లోని మేళాపురం ఆంజనేయస్వామి ఆలయ మాన్యం భూమిలో హనుమాన్ ఏకశిల విగ్రహ ప్రాణ ప్రతిష్ట పూజలు బుధవారం వైభవంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక పాల్గొని పూజలు నిర్వహించారు. మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు శివ, రామచంద్ర, నాయకులు మహేష్, నాగరాజు, కమిటీ సభ్యులు చంద్రమోహన్, వేణుగోపాల్, క్రిష్టప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


మృతుడు అఫ్రోజ్

రాప్తాడురూరల్: చదువుకోవడం ఇష్టం లేని ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి వైఎస్సార్‌కాలనీలో నివాసం ఉంటున్న బాబ్జాన్ టైలరింగ్‌తో జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు అఫ్రోజ్ (18) పామిడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో చదువులపై ఆసక్తి లేని అఫ్రోజ్ తరచూ ఇదే విషయాన్ని తల్లిదండ్రులతో చెప్పుకుని బాధపడేవాడు. అయితే తమలా కాకుండా ఉన్నతంగా బతకాలంటే చదువులే ముఖ్యమని వారు నచ్చచెబుతూ వచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన అఫ్రోజ్ 15 రోజుల క్రితంలో ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. విషయాన్ని గమనించిన తల్లి వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో కాపాడడంతో ప్రాణాపాయం తప్పింది. అప్పటి నుంచి కళాశాలకు వెళ్లకుండా ఇంటివద్దే ఉంటున్న అఫ్రోజ్... మంగళవారం రాత్రి సిండికేట్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటికి చేరుకున్న సమయంలో ఎవరూ లేకపోవడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాంతరాజు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన హలుకూరు కాంతరాజు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా కాంతరాజు మాట్లాడుతూ.. తన ఎంపికకు సహకరించిన పార్టీ అధ్యక్షులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అయ్యా నేను బతికే ఉన్నా..!

- 'పచ్చ'పాతంతో నన్ను చంపడం దుర్మార్గం
- ఎల్లో మీడియా చర్యపై ఓ సామాన్యుడి ఆవేదన


ముష్టూరు గ్రామంలో ఉన్న మాల చిన్న నరసింహులు

బత్తలపల్లి: 'అయ్యా మీరంతా కలిసి ఆ నాయకుడికి సాయం చేయాలంటే చేసుకోండి తప్పు లేదు. కానీ బతికి ఉన్న నన్ను చంపడం దుర్మార్గం' అని ముష్టూరు గ్రామానికి చెందిన మాల చిన్న నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. ముష్టూరు గ్రామానికి చెందిన పోలింగ్ కేంద్రం నంబర్ 102లో వరుస సంఖ్య 137లోని ఓటరు మాల చిన్న నరసింహులు ఏడాది కిందట మృతి చెందినట్లు ఈనాడు ఈ నెల 11వ తేదీన కథనం ప్రచురించింది. దీనిపై నరసింహులు అభ్యంతరం తెలిపారు. తాను బతికే ఉన్నానంటూ బుధవారం మీడియా ముందుకు వచ్చారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో సర్వే పక్కా చేయక తప్పులు తడకగా ఓటరు జాబితా ఉందంటూ ఈనాడు ప్రచురించిన కథనం తప్పని తేల్చేశారు. అలాగే బత్తిని బత్తినన్న గ్రామం వదలిపోయారని ఈనాడు తన కథనంలో ప్రస్తావించగా, అది తప్పని ముష్టూరు గ్రామ నాయకులు ముష్టూరు నరసింహారెడ్డి, సర్పంచు చెడిపోతుల గోపాల్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన పలువురు యువతులకు ఇటీవలే వివాహం కాగా, వారి ఆధార్ కార్డులన్నీ ఇక్కడే ఉన్నాయని, వారి ఓటు కూడా ఇక్కడే ఉందన్నారు. కానీ ఈనాడు మాత్రం ఇవేమీ తెలుసుకోకుండా అత్యుత్సాహం చూపిందన్నారు. సదరు యువతులకు రెండు ఓట్లు లేవన్న విషయం తెలుసుకోవాలన్నారు. ఎవరో టీడీపీ నాయకులు ఇచ్చిన తప్పుడు సమాచారంతో వార్తలు ఎలా రాస్తారని ముష్టూరు గ్రామస్తులు మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని సూచించారు. మృతి చెందిన వారి పేర్లు తొలగించాలని తామే బీఎల్ఓలకు సూచించినట్లు వారు తెలిపారు.

చెన్నైలో జిల్లా విద్యార్థుల ఆత్మహత్య

అన్నానగర్(చెన్నై): జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు తమిళనాడులో ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు.. విరుదునగర్ జిల్లాలోని ఓ కళాశాలలో దేశ, విదేశాలకు చెందిన విద్యార్థులు చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నారు. ఇదే కళాశాలలో అనంతపురం జిల్లా నరసాపురం గ్రామానికి చెందిన మంజునాథ్ (20), పూలకుర్లపల్లికి చెందిన అఖిల (19) చదువుతున్నారు. వీరిద్దరూ వేర్వేరు హాస్టళ్లలో ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం మంజునాథ్, అఖిల తమ గదుల్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. ఇద్దరూ ఒకే జిల్లాకు చెందిన వారు కావడంతో ప్రేమ వ్యవహారమా? లేక మరేదైనా కారణమా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

- ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల


పురస్కారాలు అందుకున్న డ్రైవర్లతో మంజుల, తదితరులు

పుట్టపర్తి టౌన్: అప్రమత్తతతో ఉన్నప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని డ్రైవర్లకు ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డీపీటీఓ మధుసూదన్ సూచించారు. పుట్టపర్తిలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ఇనాయతుల్లా ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంజుల, మధుసూదన్‌తో పాటు జిల్లా ఫైర్ అధికారి హేమంత్‌రెడ్డి, అసిస్టెంట్ అధికారి నాగరాజనాయక్ హాజరయ్యారు. ప్రమాద రహిత డ్రైవింగ్‌లో రాణిస్తున్న 18 మంది డ్రైవర్లకు ఉత్తమ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. కొన్ని కుటుంబాల జీవితాలు డ్రైవర్ల చేతుల్లో ఉంటాయన్నారు. విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఎందరో డ్రైవర్లు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయన్నారు. అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని వృత్తిలో రాణించాలన్నారు.

స్పెషల్ బ్రాంచ్‌లో కీచకుడు

కదిరి: ఆయనంటే మహిళలకు హడల్. ముఖ్యంగా భర్త చనిపోయిన మహిళలు ఆయనను చూడగానే భయపడిపోతారు. ఎందుకంటే పాస్‌పోర్టు చేతికి రావాలంటే ఆయన చెప్పినట్లు వినాల్సిందే. కదిరి నియోజకవర్గ స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) విభాగంలో పని చేసే సదరు హెడ్‌కానిస్టేబుల్ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగు చూడడంతో పలువురు ఏవగించుకుంటున్నారు.

మచ్చుకు కొన్ని....

- ఇటీవల కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన ఒంటరి మహిళ బతుకుతెరువు కోసం సౌదీకి వెళ్లేందుకు సిద్ధమై పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో విచారణ కోసం వెళ్లిన ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్... పాస్‌పోర్టు రావాలంటే ఓ గంట తనతో గడపాల్సిందేనని ఒత్తిడి చేశాడు. ఆ సమయంలో అతని ప్రవర్తనతో భయపడిన ఆమె ఇంట్లో నుంచి బయటకు పరుగు తీస్తుండగా పక్కింటి మహిళ అనుకోకుండా అక్కడికి చేరుకుంది. దీంతో ఆయన అక్కడి నుంచి వెంటనే జారుకున్నాడు. జరిగిన విషయం పక్కింటి మహిళతో చెప్పి కన్నీరు పెట్టుకుంది. విషయం తెలుసుకున్న మరికొందరు మహిళలు ఏకమై ఆమెకు తోడుగా నిలిచి ఉదయాన్నే అతన్ని చీపుళ్లతో కొట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం కాస్త తెలుసుకున్న ఆయన రాత్రికి రాత్రే జీవిమాను కూడలిలో తాను నివాసముంటున్న గదిని ఖాళీ చేసి రూరల్ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న క్వార్టర్స్‌లోకి మకాం మార్చేశాడు.
- కోవిడ్ సమయంలో నల్లమాడ పోలీస్ స్టేషన్‌లో పనిచేసేటప్పుడు కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన 700 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని గుట్టు చప్పుడు కాకుండా అమ్ముకున్నాడు. ఈ విషయంగా అప్పట్లో నల్లమాడ ఇన్‌చార్జ్ డీఎస్పీగా ఉన్న చైతన్య విచారణ చేపట్టి ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్పీ సత్యయేసుబాబుకు నివేదిక సమర్పించారు.
- కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేసేటప్పుడు నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ నిల్వ చేసిన 2 టన్నుల ఇనుప కడ్డీలు, 100 బస్తాల సిమెంట్‌ను అపహరించి, బయటి వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఈ అంశం వెలుగు చూడడంతో అప్పటి పట్టణ ఎస్ఐ ఖాజాహుస్సేన్ గట్టిగా మందలించాడు.
- ఓ పోలీస్ స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేసే మహిళను బలత్కారం చేయబోతే గుట్టుచప్పుడు కాకుండా అప్పట్లో ఆయనను వీఆర్‌కు పంపారు. అన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ పాస్‌పోర్టు మంజూరుకు రూ. వెయ్యి నుంచి రూ.5వేల వరకూ చెల్లించుకోవాల్సిందే. లేకపోతే తిరకాసు పెట్టి పాస్‌పోర్టు మంజూరు కాకుండా చేస్తాడు.
- సాధారణంగా ఇంటిలిజెన్స్ విభాగం నుంచి సమగ్ర విచారణ జరిపి ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని ధ్రువీకరించుకున్న అనంతరమే స్పెషల్‌బ్రాంచ్‌లో పోస్టింగ్ ఇస్తారు. మరి ఇంతటి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని ఎస్‌బీలోకి ఎలా తీసుకున్నారో తమకు అర్థం కావడం లేదని తోటి కానిస్టేబుళ్లే ఆశ్చర్యపోతున్నారు.
- జిల్లా కేంద్రంలోని స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో పనిచేసే ఈయన తన సామాజిక వర్గానికి చెందిన కొందరి సహకారంతోనే రెచ్చిపోతున్నట్లుగా పోలీసు వర్గాల సమాచారం. దీనిపై ఎస్పీ మాధవరెడ్డి సమగ్ర దర్యాప్తు జరిపి కామాంధుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కదిరి ప్రాంత మహిళలు కోరుతున్నారు.

అనుక్షణం నీకోసమే సాయీ


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: 'అనుక్షణం నీకోసమే సాయీ' అంటూ ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బుధవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో ఈశ్వరమ్మ పాఠశాల పదో తరగతి విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చక్కటి భక్తిగీతాలతో సంగీత కచేరీతో పాటు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సత్యసాయిపై తమ భక్తి భావనను చాటుతూ గ్రీటింగ్స్‌ను మహాసమాధి చెంత ఉంచి ఆశీర్వాదం కోరారు. బోర్డు పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు అభినందించారు.


సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు